"స్థలాలు, ఇళ్లు కొన్నా సోర్స్ చెప్పాలి. గట్టి చిక్కే" చెప్పాను.

"అవును. అంచేత వున్న డబ్బుని చక్కబెట్టుకోలేనప్పుడు కొత్తగా లంచాలు తీసుకొని ఇంకా బాధలు పెంచుకోలేరుగా. అంచేత లంచాలు తీసుకోవడం మానేయమని మా అందరికీ స్ట్రిక్ట్‌గా ఆర్డర్స్ వచ్చాయి."

ఒక్క మునిసిపల్ శాఖామాత్యులేనా లేక మిగతా మంత్రులంతా కళ్ళు తెరిచారో లేదో చూద్దామని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకి, కస్టమ్స్ ఆఫీసుకి, ఇంకా అన్ని రాష్ట్ర ప్రభుత్వ లంచాలు తీసుకునే ఆఫీసులన్నిటికీ వెళ్ళాను. ఎక్కడా పైసా కూడా లంచం తీసుకోకుండా నా పనులన్నీ టకటక అయిపోయాయి.

తుంటిమీద కొడితే పన్ను రాలినట్లు ఎక్కడో అయిదున్నర వేల మైళ్ళ దూరంలో మన దేశంలో పాతికో వంతు కూడా లేని ఓ చిన్న దేశం తాలూకు బేంక్ తమ నియమాల్లో చేసిన చిన్న మార్పుకి ఒక్కసారిగా మన దేశ ప్రజల పరిస్థితి బాగుపడడం తలచుకుంటే ఈ ప్రపంచం ఎంతో చిన్నది అనిపించి....

"పేపర్ చదువుతూ నిద్రపోతావేమిటి? అన్నానికి లే" అన్న మా అమ్మ మాటలకి ఓ కమ్మని కల చెదిరింది. మే 25, 1991 దిన పత్రికని చూసి లేచాను.

# సినిమా హాళ్లలో హాస్యం

మన దేశంలో చవకయిన, పాపులర్ అయిన వినోదం సినిమా హాళ్ళలోనే దొరుకుతుంటుంది. సినిమాహాళ్లు ఒకప్పుడు డబ్బా రేకుల కప్పులతో, చెక్క బల్లలతో వుండేవి. కాని ఇప్పుడు అవి ఎయిర్ కండిషన్డ్ సౌకర్యంతో (అది నిజంగా వేసినపుడు సుమా) కుషన్ చెయిర్స్‌తో ఎంతో దర్జాగా ఉంటున్నాయి. కొందరు సినిమా ఏదో కూడా

చూసుకోకుండా వేసవిలో చల్లదనం కోసం ఎ.సి. థియేటర్‌కి వెళ్ళి నిద్ర పోతుంటారు.

బెంగుళూరులోని ఓ సినిమా థియేటర్‌లో చంటిపిల్లలని తీసుకెళ్ళే వారి సౌకర్యం కోసం ఓ క్లాసులో సీట్లపక్కనే వాళ్ళని పడుకోబెట్టడానికి ఉయ్యాల ఏర్పాటు ఉంది.

ఏడ్చే చిన్నపిల్లలున్నవారు ఎక్కడికి వెళ్తుంటారు? అన్న కొంటె ప్రశ్నకి సమాధానం 'సినిమాహాల్స్‌కి'. నిజమే. సినిమా హాళ్ళలో పిల్లల ఏడుపులు వినిపిస్తుంటాయి. ముఖ్యంగా భయానక దృశ్యాల్లో. ఇలాంటి వారి బారినుంచి పిల్లలు లేనివారిని రక్షించ డానికి పిల్లలు ఏడ్చినా బయటకి వినపడకుండా అద్దాల కేబిన్స్‌ని ఓ థియేటర్‌లో ఏర్పాటు చేసారట. ఎదురుగా ఉన్న ట్రాన్స్‌పరెంట్ అద్దం లోంచి సినిమా చూడవచ్చు. పిల్లలు ఏడిస్తే ఆ శబ్దం ఆ కేబిన్‌లోంచి దాటి బయటకి పోదు.

సినిమా హాల్స్‌కి వచ్చేవాళ్ళంతా సినిమా చూడడానికే వస్తారంటే పొరబాటవుతుంది. అనేక కారణాలకి సినిమా థియేటర్‌కి వస్తుంటారు.

ఓసారి ఓ యువజంట సినిమాకి వచ్చి బాల్కనీలో యధేచ్ఛగా శృంగారం సాగించసాగారు. అది అతి చెత్త సినిమా కాబట్టి జనం పలచగా ఉంటారన్న ధైర్యంతో వచ్చారు. నిజంగా థియేటర్‌లో తక్కువ మందే ఉన్నారు. సినిమా అయాక ఆ హాల్ మేనేజర్ ఆ యువజంట దగ్గరకి వచ్చి 'అయ్యా. ఇవాళతో ఆ సినిమా మారుద్దాం అనుకున్నాం. కాని ఓ-వారం పెంచుతున్నాం. అలాగే ఓ వారందాకా మీకి బాల్కనీలో రెండు సీట్లకి పాస్ ఇస్తున్నాం. మూడు పూటలా వచ్చి వెళ్తూండండి. ప్రేక్షకులంతా ఆ సినిమా కంటే మీ సినిమానే బావుందని చెప్పుకుంటు న్నారు' అని చెప్పాడు.

నిజమే. సెన్సార్ వాళ్లు తెరమీద సెక్స్‌ని కట్ చేయగలరు గానీ తెరముందు సెక్స్ కట్ చేయలేరు కదా. సినిమా జరుగుతుండగా చీకట్లో ఎన్ని ముద్దులో, ఎన్ని కౌగిలింతలో ఎవరు చూడొచ్చారు? కాబట్టి సిని మాల్లో ప్రేమ గురించి, సెక్స్ గురించి ఎంతో తెలుసుకోవచ్చు. సినిమా

మిమ్మల్ని డిస్టర్బ్ చేయకపోతే.

సినిమా హాళ్ళు రైల్వే స్టేషన్ దగ్గరగా ఉంటే, రైలు లేటయి నప్పుడల్లా టైంపాస్‌కి ఆ థియేటర్‌లో కూర్చునేవాళ్ళు నాకు తెలుసు. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి నడిచి వెళ్ళేంత దూరంలో ఇలాంటి థియేటర్ ఒకటుంది. ఆ థియేటర్‌లో ఓసారి నేనలాంటి సందర్భంలో ఓ సినిమాకి వెళ్ళినప్పుడు నా ముందు కూర్చునున్న ఓ నార్త్ ఇండియన్ వెనక్కి తిరిగి అడిగాడు నన్ను

"నా టోపీ సినిమా చూడడానికి అడ్డొస్తోందా? తీయమంటారా"

"వద్దు. సినిమా కంటే మీ టోపీనే హాస్యంగా ఉంది' అని సమాధానం చెప్పాను. మరుక్షణం అతను లేచి మరోచోటికి వెళ్ళి కూర్చున్నాడు. ఇలాగే ఓసారి నందిగామాలో అనుకుంటా ఓ సినిమా థియేటర్‌కి వెళ్ళి 'మేట్నీ ఎప్పుడు మొదలవుతుంది?' అని నేను, నా మిత్రుడు అడిగితే 'మీరు ఎప్పుడు మొదలవ్వాలనుకుంటున్నారో చెప్తే అప్పుడు మొదలు పెడతాం' అన్నాడా మేనేజర్. కొన్ని సినిమా థియేటర్లలో మంచి సినిమాలున్నా ప్రేక్షకులు రారెందుకో.

సినిమా అయాక బయట వినిపించిన డైలాగ్స్ "సినిమా చూస్తున్నంత సేపు కడుపు వుబ్బి చచ్చిపోయాననుకోండి"

"అంత కామెడీ లేదే కడుపుబ్బ నవ్వడానికి?"

"డైరెక్టర్ తెలివయినవాడు. బాత్‌రూంలన్నీ లాక్ చేయించేసాడు. ఇంక కడుపుబ్బక ఏమవుతుంది?"

హారర్ సినిమా ఓమెన్–టూ కి సెకండ్‌షోకి వెళ్ళాను. సినిమా అయి బయటికి వచ్చాక ఇలాంటి డైలాగ్స్ వినిపించాయి.

"ఈ సినిమాకి టికెట్టిచ్చి రేపు సెకండ్ షోకి రామరాజుని పంపిస్తాను."

"సినిమా అంత బావుందా?"

"కాదు. మనం హేట్ చేసే వాళ్ళని పంపాల్సిన సినిమా ఇది".

ఆ మధ్య ఓ హిందీ సినిమా బెజవాడలో వచ్చింది. మూడోరోజు

డబ్బాలు తిరిగి వెళ్ళిపోయాయి. థియేటర్ బయట ఎవరో కొంటెకుర్రాడు ఇలా రాసాడు.

"క్లోజ్డ్ బై పాపులర్ డిమాండ్"

అమెరికాలో టి.వి. ప్రాధాన్యత అధికం అయ్యాక ప్రేక్షకులు సినిమా థియేటర్‌లకి రాక, ఇళ్ళలోనే టి.వి. లని చూసేవారు. దాంతో హాలీవుడ్ స్టూడియోలతో పాటుగా సినిమా హాళ్ళ బిజినెస్ కూడా పడి పోయింది. థియేటర్ మేనేజర్స్ ప్రేక్షకులని ఆకర్షించడానికి, టికెట్లు నంబర్లని లాటరీ తీసి గెలుపొందిన వారికి సామాను ఇచ్చేవారు. థియేటర్‌కి వచ్చిన అందరికీ ఫలహారాలు పెట్టేవారు.

దాంతో ప్రేక్షకులు సినిమా హాళ్ళకి ఫోన్‌చేసి "ఏం పిక్చర్ ఆడుతోంది?" అని అడిగే బదులు "ఇవాళ ఏం ఫలహారం పెడుతున్నారు" అని అడిగే వారు. తర్వాత సెవెంటీ ఎం.ఎం., త్రి–డి, స్టీరియో ఫోనిక్ సౌండ్ లాంటి అదనపు ఆకర్షణల వల్ల థియేటర్లు మళ్ళీ కిటకిట లాడసాగాయి.

ఓ పార్టీలో ఓ సినిమా థియేటర్ ప్రొప్రయిటర్ కలిసాడోసారి. జనం ఏ వైపు సినిమాలు కావాలో తెలుసుకోవాలని ఆయన్ని అడిగాను, ప్రేక్షకులు ఆయన్ని సాధారణంగా ఏం రిక్వెస్ట్ చేస్తుంటారని.

"బాత్‌రూం ఎక్కడ?" అన్నది ఆయన ఠక్కున ఇచ్చిన సమాధానం.

ఇంగ్లీష్ భాషలోని చక్కని పన్‌ని ఉపయోగించి, థియేటర్ మీద ఎక్కడో నే చదివిన వాక్యం ఇది.

CRISIS IN THEATRE LAND. GOVERNMENT ACTS.

సినిమా హాలుకి పిల్లల్ని తీసుకెళ్తే కొన్ని ప్రమాదాలని తల్లిదండ్రులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ఓ సినిమా హీరోయిన్‌కి హీరో చెంపదెబ్బ కొడితే ఆమె 'అబ్బానీ తీయని దెబ్బ' అని పాట అందుకుంటుంది. వెంటనే ఆ కుర్రాడు అమాయకంగా తన తల్లిని 'అమ్మా అదేంటి. నీలా తిరిగికొట్టకుండా అలా పాట పాడుతోంది?' అని గట్టిగా అడిగేశాడు. చుట్టుపక్కలవాళ్లు

ఘొల్లున నవ్వకుండా ఉంటారా?

కీ॥శే॥ టి. అంజయ్య ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా ఓసారి కారులో వెళ్తుంటే 'థియేటర్ అండర్ రినవేషన్' అన్న బోర్డుని ఎప్పుడూ తెలుగు సినిమాలు వేసే థియేటర్ బైటచూసి ఆయన 'వీడు తెలుగు మానేసి ఇంగ్లీషు సినిమాలు ఆడిస్తున్నాడే?" అన్నాడట.

ఇంకో పొలిటికల్ జోక్ ఓ తెలుగు పొలిటీషియన్ మీద విన్నాను. ఆయన సినిమా థియేటర్లని ప్రతిపక్ష కీచకులు నాశనం చేసేశారు. ఆ సంగతి తెలిసి ఆయన థియేటర్ దగ్గరికి వెళ్ళి కళ్ళనీళ్ళు పెట్టుకున్నారుట.

'మీరు బాధ పడకూడదు' అని ఎవరో ఓదారుస్తుంటే ఆయనగారు వెంటనే 'బాధా, గాడిదగుడ్డా? రెండు బాల్కనీ సీట్లు ఖాళీగా ఉన్నాయి' అన్నారు.

మా అక్కయ్య కొడుకుని తీసుకుని ఆ మధ్య ఓ సినిమాకి వెళ్ళాను. ఆరేళ్ళవాడికది అర్థం కాలేదు. నచ్చలేదు. ఇంటికొచ్చాక మా అక్కయ్య వాణ్ణి 'ఏరా? సినిమా ఎలా ఉంది' అని అడిగితే వాడు 'అమ్మా, నేనా సినిమాకి వెళ్ళినందుకు సంతోషంగా వుంది. ఎందుకంటే అది అయిపోయాక ఎంతో సంతోషం వేసింది కాబట్టి' అని చెప్పాడు. నిజమే. చాలా సినిమాలు అలాగే ఉంటున్నాయి.

పదిహేనేళ్ళ క్రితం అనుకుంటా ఓ తెలివయిన దొంగ సినిమాకి టికెట్లని ఓ దంపతులకి పోస్ట్‌లో పంపాడు. అది ఎవరు పంపి ఉంటారా అనుకుని వాళ్ళు ఎంచక్కా ఆ సినిమాకి సెకండ్ షోకి వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇల్లు మొత్తం దోచేసాడు.

'ఇప్పుడు ఆ టికెట్లు ఎవరి దగ్గరినుంచి వచ్చాయో అర్థమయిందా?' అన్న కాగితం కూడా వాళ్ళింట్లో పెట్టాడా దొంగ.

11 ఏళ్ళ రాల్ఫ్ బెలింగర్ అనే కుర్రాడు కోపం వచ్చి ఇంట్లోంచి పారిపోయాడు. షికాగో పోలీసులు అతనికోసం వారంపాటు తీవ్రంగా గాలించారు. కాని విఫలం అయారు. వారం తర్వాత తిరిగొచ్చిన రాల్ఫ్‌ని 'ఎక్కడున్నావురా ఇన్నాళ్ళు?' అనడిగితే, ఓ సినిమా థియేటర్లో

దాక్కున్నానని చెప్పాడు. శుభ్రంగా మూడు షోలు చూసి రాత్రిళ్ళు కర్టెన్ వెనకాల దాక్కునేవాడట. హాలునిండాక కర్టెన్ లేవబోయేముందు ప్రేక్షకుల్లో కలిసిపోయేవాడట. 'ఆ సినిమా చూసి చూసి బోరు కొట్టబట్టి వచ్చాను మమ్మీ' అన్నాడా భడవాయ్.

సినిమా హాల్స్ కర్టెన్ మీద కూడా ఓ ముతక జోకుంది. మొగ కర్టెన్స్ పైకి లేస్తే ఆడ కర్టెన్సు రెండూ పక్కలకి తొలగుతాయట!

సినిమా హాలుకి సంబంధించిన చాలామందికి తెలిసిన జోక్ రాస్తే కాని ఈ వ్యాసం పూర్తయినట్లు కాదు. 'సారి. ఇందాక వెళ్తూ మీ కాలు తొక్కానా?' అని ఒకడు ఇంటర్వెల్‌లో ఓ వరసలో మొదట కూర్చుని ఉన్నతన్ని అడిగితే అతను అవునంటే 'అయితే ఈ వరసలోనే అన్నమాట మన అయిదు, ఆరు సీట్లు' అని ఆ ప్రశ్న అడిగినతని భార్య మెల్లిగా చెప్పింది.

# ఓ లాయర్ బత్తాయి పండు ఇస్తే....

లాయర్ అవసరం రానివాళ్ళు అదృష్టవంతులు. వచ్చిన వాళ్ళకే తెలుస్తుంది లాయర్ అంటే ఏమిటో. ఎక్కడ బాధ, ఫ్రస్టేషన్ వుంటే అక్కడ జోక్స్ సృష్టించబడతాయి. (ఉదాహరణకి కమ్యూనిస్టు రష్యాలో కమ్యూనిజంమీద, నియంతమీద అనేక జోకులు పుట్టాయి.) అలాగే లాయర్లతో విసిగిపోయిన వారు లాయర్లమీద చాలా జోకులు పుట్టించారు.

కోర్టుకెళ్ళిన ఓ పెద్దమనిషి లాయర్‌ని దృష్టిలో వుంచుకుని చెప్పిన మాట. 'నా జీవితంలో రెండుసార్లు నష్టపోయాను. కోర్టులో నేను ఓడిపోయినప్పుడోసారి, గెలిచినప్పుడోసారి' అని.

లాయరంటే విసిగిపోయిన ఇంకో పెద్దమనిషి చెప్పిన జోక్: బ్రిటన్‌లో ఓ లాయరు ఓ బాతుని తుపాకితో కాలిస్తే లేండ్‌లార్డ్